బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 18 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4



## ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు.. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో, ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న తెలంగాణ వాసులు,విద్యార్థులకు సహాయం అందించేందుకు, తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు రెండు దేశాల భారత రాయబార కార్యాలయాల నుంచి అందిన తాజా వివరాల ప్రకారం, ఇప్పటి వరకు తెలంగాణకు చెందిన ఎవరూ ప్రభావితమైనట్టు సమాచారం లేదు. అయినప్పటికీ, భవిష్యత్ పరిణామాల దృష్ట్యా ముందు జాగ్రత్తగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడమైనది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారం, ఢిల్లీలోని తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో, ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదిస్తూ అవసరమైతే తక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. సహాయం అవసరమైన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించవచ్చు వందన,పి.ఎస్, రెసిడెంట్ కమిషనర్: 91 9871999044, జి. రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్: 91 9643723157, జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్: 91 9910014749, సిహెచ్. చక్రవర్తి, పౌర సంబంధాల అధికారి 91 9949351270

# 'బనకచర్ల'పై ప్రభుత్వం సీరియస్

- నేడు ఎంపీలతో భేటీ
- సీఎంతోపాటు కేంద్రమంత్రులు రాక



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించేందుకు జూన్ 18, 2025న సచివాలయంలో అన్ని పార్టీల సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సమావేశానికి రాష్ట్రంలోని ఎంపీలు (లోక్‌సభ, రాజ్యసభ) అందరినీ ఆహ్వానించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమావేశానికి హాజరుకానున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి గ. కిషన్ రెడ్డి మరియు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌లకు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తీకరించేందుకు ఆహ్వానం పంపినట్లు ప్రకటించారు.

ఈ మేరకు మంగళవారం మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన పేర్కొన్నదానినిబట్టి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును జలశక్తి, ఆర్థిక శాఖల ముందుకు ప్రతిపాదనగా పంపినట్లు చెప్పారు. "ప్రాథమిక అధ్యయనాల ప్రకారం ఈ ప్రాజెక్టు గోదావరి వాటర్ల వివాద ట్రిబ్యునల్ 1980 ఉత్తర్వులు మరియు ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014ను ఉల్లంఘించే అవకాశం ఉంది. ఇది అమలైతే తెలంగాణ హక్కులపై తీవ్ర ప్రభావం చూపుతుంది" అని ఆయన పేర్కొన్నారు.

అలాగే, ఈ విషయాన్ని కేంద్ర మంత్రులకు 2025 జనవరి 22న లేఖ రాసి వివరించినట్టు తెలిపారు. జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ 2025 మే 28న స్పందిస్తూ, గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు యొక్క వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక కేంద్రానికి సమర్పించలేదని స్పష్టంచేశారు. ప్రాజెక్టు వచ్చిన వెంటనే, దానిపై ట్రిబ్యునల్ ఉత్తర్వులు, అంతర్ రాష్ట్ర ఒప్పందాలు, మరియు ఏపీఆర్ఏ నిబంధనల ప్రకారం సమీక్ష జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూన్ 3న ఢిల్లీలో కేంద్ర మంత్రి పాటిల్‌ను కలసి ప్రాజెక్టుపై తెలంగాణ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసినట్లు తెలిపారు. అలాగే, జూన్ 13న ప్రాజెక్టు ప్రి-ఫీజిబిలిటీ రిపోర్టును తిరస్కరించాలని కేంద్ర జల కమిషన్‌కు లేఖ రాసినట్లు వెల్లడించారు. "ఈ పరిణామాల మధ్య, భవిష్యత్ చర్యలపై చర్చించేందుకు, తెలంగాణ ఎంపీల అభిప్రాయాలు పొందే ఉద్దేశంతో ఈ సమావేశం జరుగుతోంది. ముఖ్యమంత్రి ఈ సమావేశానికి హాజరవుతారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి నేతల నుంచి కూడా నిర్మాణాత్మక సూచనలు అందుతాయని ఆశిస్తున్నాం" అని మంత్రి ఉత్తమ్ చెప్పారు.

## గోవుల సంరక్షణకు
# సమగ్ర విధానం రూపొందించాలి

- రూపకల్పనకు ముగ్గురు అధికారులతో ప్రత్యేక కమిటీ
- తొలి దశలో నాలుగు ప్రాంతాల్లో ఆధునిక వసతులతో గోశాలలు
- పశుసంవర్ధక శాఖ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో గోవుల సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో ఒక కమిటీని నియమించారు. పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కూడిన కమిటీ ఈ విషయంలో లోతైన అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

రాష్ట్రంలో గో సంరక్షణపై ముఖ్యమంత్రి తన నివాసంలో మంత్రి వాకిటి శ్రీహరితో పాటు ఉన్నతాధికారుల సమావేశంలో సమీక్షించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోవుల సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. కోడె మొక్కులు చెల్లించే దేవాలయాలైన వేములవాడ, యాదగిరిగుట్టతో పాటు, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్ధక శాఖ విశ్వవిద్యాలయం సమీపంలో తొలుత గోశాలలు నిర్మించాలని చెప్పారు. భక్తులు సమర్పించే కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనపర్చాలని, వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలని చెప్పారు. భక్తులు గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులు దానం చేస్తున్నారని.. స్థలాభావం, ఇతర సమస్యలతో అవి తరచూ మృత్యువాత పడుతున్నాయని ముఖ్యమంత్రి గారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితులను అధిగమించి గోవుల సంరక్షణే ధ్యేయంగా తొలుత రాష్ట్రంలోని నాలుగు ప్రదేశాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సూచించారు. గో సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఖర్చయినా వెనుకాడదని సీఎం గారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను ఈ సందర్భంగా అధికారులు సీఎం గారికి అందజేశారు.

# అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- జయశంకర్ భూపల్లిజిల్లాలో కేవీ సబ్ స్టేషన్‌లు ప్రారంభం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

2023 మార్చిలో 15 వేల మెగావాట్ల డిమాండ్ ఉంటే.. 2025 మార్చిలో 17 వేల మెగా వాట్ల డిమాండ్‌లను సైతం పెంచి విద్యుత్‌కి అంతరాయం లేకుండా సరఫరా అందజేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ ఉండదని బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రూ. 8.70 కోట్ల వ్యయంతో నిర్మితమైన 33/11 కె.వి. సబ్ స్టేషన్‌లను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "తెలంగాణ రాష్ట్రాన్ని విద్యుత్ రంగంలో ముందు వరుసలో నిలబెట్టే దిశగా ఈ విధమైన అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయి. ఈ సబ్ స్టేషన్‌లు గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన, నిరవధికంగా విద్యుత్‌ను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ సందర్భంగా స్థానికంగా నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని ప్రజల ఆశయాలను, అవసరాలను తెలుసుకునే అవకాశం నాకు లభించింది. ప్రజల ఆశీస్సులతో మరింత బలోపేతంగా పని చేయాలన్న ఉద్దేశంతో ముందుకు సాగుతున్నాము. తెలంగాణ రాష్ట్రాన్ని ఒక పక్క అభివృద్ధి చేస్తుంటే బీఆర్ఎస్ నేతలు మాత్రం తమ ప్రభుత్వంపై గగ్గోలు పెడుతున్నారు. పదేళ్ల పాటు డబుల్ బెడ్ రూం ఇళ్లు, వడ్డీ లేని రుణాలు, ఉచిత విద్యుత్, నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు కల్పించలేక పోయింది. ప్రజల సమస్యలపై నిరంతరం కృషి చేసే ప్రజా ప్రతినిధులు ఉండటం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ ఉండదని బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు మల్లు భట్టి విక్రమార్క.

2023 మార్చిలో 15 వేల మెగావాట్ల డిమాండ్ ఉంటే.. 2025 మార్చిలో 17 వేల మెగా వాట్ల డిమాండ్‌లను సైతం పెంచి విద్యుత్‌కి అంతరాయం లేకుండా సరఫరా అందజేస్తున్నామని మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా విద్యుత్ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. రూ. 21 వేల కోట్లు రైతు రుణమాఫీని మూడు నెలల్లో జమ చేశామని తెలిపారు. రైతులకు రూ. 13600 కోట్లు రైతు భరోసా అందించామని అన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు తమ ప్రభుత్వం రైతులకు అందిస్తోందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ పాల్గొన్నారు.

# పలు ఎయిర్ ఇండియా విమానాల సర్వీసులు రద్దు

- ఒక్క రోజే ఆరు సర్వీసులు రద్దు
- మరో రెండు విమానాల్లో సాంకేతిక లోపాలు




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పలు ఎయిర్ ఇండియా విమానాలు వివిధ కారణాలతో రద్దయ్యాయి. మంగళవారం లండన్, పారిస్ నగరాలకు వెళ్ళాల్సిన ఎయిర్ ఇండియా విమానాలు రద్దు కాగా, శాన్‌ఫ్రాన్సిస్కో-ముంబయి విమానం స్టాప్ ఓవర్ సమయంలో ఒక లోపం కారణంగా ప్రయాణికులు విమానాన్ని దిగాల్సి వచ్చింది. ప్రయాణానికి ముందు జరిగే తనిఖీల్లో భాగంగా కొన్నిసమస్యలు కనుగొనడంతో ఢిల్లీ-పారిస్ విమానాన్ని రద్దు చేశారు. అలాగే అందుబాటులో మరో విమానం లేకపోవడంతో అహ్మదాబాద్-లండన్ విమాన సర్వీసునుకూడా రద్దు చేసినట్లు ఎయిర్‌లైన్స్ వర్గాలు తెలిపాయి. మరో సంఘటనలో శాన్‌ఫ్రాన్సిస్కో- ముంబయి విమానం మంగళవారం ఉదయం కోల్‌కతాలో స్టాప్‌ఓవర్ కోసం ఆగిన సమయంలో ఒక ఇంజనులో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆ విమాన సర్వీసును నిలిపివేశారు. మొత్తంగా ఐదు సర్వీసులు రద్దయ్యాయి. వాటిలో ఢిల్లీ-దుబాయ్, ఢిల్లీ-వియన్నా, ఢిల్లీ-పారిస్, అహ్మదాబాద్ -లండన్, బెంగళూరు-లండన్, లండన్-అమృతసర్ సర్వీసులు వున్నాయని ఎయిర్ ఇండియా వెబ్‌సైట్ పేర్కొంది. వీటికి తోడుగా, ఢిల్లీకి రావాల్సిన ఎఐ 315 డ్రీమ్‌లైనర్ విమానంలో సాంకేతిక సమస్య రావడంతో ఆ పైలట్ హాంకాంగ్‌కు తిరిగి వెళ్ళాల్సి వచ్చింది. ఢిల్లీ-పారిస్‌సర్వీసు రద్దు చేసిన నేపథ్యంలో అందులోని ప్రయాణికులకు హోటల్ వసతి కల్పించినట్లు ఎయిర్‌లైన్స్ తెలిపింది. ప్రయాణికులు ఒకవేళ తమ టిక్కెట్‌ను కేన్సిల్ చేసుకుంటే పూర్తిగా రీఫండ్ ఇస్తామని, లేదా రీ షెడ్యూలింగ్ చేస్తామని తెలిపింది. ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు త్వరగా చేరుకోవడానికి వీలుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపింది.

అహ్మదాబాద్- లండన్ విమాన సర్వీసును సాంకేతిక సమస్య కారణంగా రద్దు చేయలేదని, అందుబాటులో మరో విమానం లేనందునే చేయాల్సి వచ్చిందని స్పష్టం చేసింది.

## రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

నైరుతి రుతుపవనాలు వేగంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురువనున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్ర వెల్లడించింది. బుధవారం రాష్ట్రంలో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రా కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్క ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. దక్షిణ ఒడిశా వద్ద ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. హైదరాబాద్ సహ ఇతర జిల్లాల్లో సైతం మేఘావృతమైన వాతావరణం ఉంటుందని అధికారులు వెల్లడించారు



## టీపీసీసీ చీఫ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫోన్ ట్యాపింగ్ పేరిట టీపీసీసీ అధ్యక్షుడు చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ మహేష్ కుమార్ గౌడ్ కు లీగల్ నోటీసులు పంపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హామీలు అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ సర్కారు తన చేతికానీతాన్ని కప్పిపుచ్చేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి రాద్ధాంతం చేస్తోందని దుయ్యబట్టారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా తమపై, తమ పార్టీ నేతలపై ఇంతటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. వెంటనే బేషరతుగా మహేష్ కుమార్ గౌడ్ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చట్టాలను గౌరవించే వ్యక్తులుగా అక్రమంగా పెట్టిన కేసు విచారణకు సైతం హాజరై సహకరించామని తెలిపారు. ఆరు గ్యారెంటీలను, 420 హామీలను పూర్తిగా గాలికొదిలేసి ఇలాంటి దిక్కుమాలిన చర్యలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని కేటీఆర్ హెచ్చరించారు. అడ్డగోలుగా మాట్లాడితే బీఆర్ఎస్ శ్రేణులు కూడా చూస్తూ ఊరుకోబోరని తెలిపారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నేతలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికల్లో ప్రజల్ని తప్పుదోవ పట్టించాలనే దురుద్దేశంతోనే మరోసారి ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారు తప్ప, ఈ లొట్టపీసు కేసుతో ఒరిగేదేమీ మిగితా 2వ పేజీలో

# నేటి నుంచి టెట్ పరీక్షలు

- 1.83 లక్షల మంది దరఖాస్తు
- 66 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీటెట్) రాతపరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో జరుగుతాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్‌పర్సన్ ఈ నవీన్ నికోలస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ రాతపరీక్షలను తొమ్మిది రోజులపాటు 16 విడతల్లో నిర్వహిస్తామని తెలిపారు. టెట్ కోసం రాష్ట్రవ్యాప్తంగా పేపర్-1కు 63,261 మంది, పేపర్-2కు 1,20,392 మంది కలిపి మొత్తం 1,83,653 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. వారి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల్లో 66 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజిగిరి, నల్లగొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సిద్ధిపేట, సూర్యాపేట, వరంగల్ జిల్లాల్లో పరీక్షా కేంద్రాలున్నాయని వివరించారు. టెట్ పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు, సమస్యలుంటే 7093708883/ 7093708884/ 7093958881/ 7093468882 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

# 26న గోల్కొండ కోట నుంచి తొలి బోనం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- గోల్కొండ కోట ఆవరణలో సమీక్షా సమావేశం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలతో రాష్ట్ర ఖ్యాతి విశ్వవ్యాప్తం కావాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. మంగళవారం గోల్కొండ కోట ఆవరణలో సమీక్షా సమావేశం జరిగింది. పోలీసులు, రెవెన్యూ, ఆర్ అండ్ బి, విద్యుత్, దేవాదాయ, వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపక, టూరిజం, సమాచార శాఖల అధికారులు పాల్గొన్నారు. శ్రీ జగదాంబ మహంకాళి దేవస్థానంలో బోనాల ఏర్పాట్లపై సమీక్ష జరిగింది.

మంత్రి మాట్లాడుతూ ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ నిరంతర పర్యవేక్షణ కల్పించి శాంతిభద్రతల మిగితా 2వ పేజీలో

# బీసీ రిజర్వేషన్లకు రైల్‌రోకో

- జులై 17న నిర్వహణ
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపు
- తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో బీసీ రౌండ్ టేబుల్ సమావేశం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీసీ రిజర్వేషన్లకై జులై 17న రాష్ట్ర వ్యాప్తంగా రైల్‌రోకో కార్యక్రమానికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. అన్ని బీసీ సంఘాల నాయకులను కలుపుకొని రైల్‌రోకోలో పాల్గొంటామని ఆమె పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో బీసీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.



ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి చేస్తామన్నారు. ఢిల్లీ పాలకులకు తెలంగాణ బీసీల పౌరుషం ఏంటో చూపిస్తాం. ఢిల్లీ పాలనకు సెగ తాకేలా రైల్ రోకో ఉంటుంది. 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలు నిర్వహించనివ్వబోం. 42 రిజర్వేషన్లు ఇవ్వకుండా కాంగ్రెస్ కుట్ర చేస్తుంది. బీసీ విద్యార్థులు, మహిళలు ఈ ఉద్యమంలో పెద్ద ఎత్తున కలిసిరావాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తోంది అని కవిత ప్రకటించారు.

తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఒత్తిడితోనూ అసెంబ్లీలో ప్రభుత్వం మూడు బీసీ బిల్లులు పెట్టింది. వార్డు మెంబర్, సర్పంచ్‌లు కాని అనేక కులాలు బీసీల్లో ఉన్నాయి. అసెంబ్లీ గడప తొక్కని అనేక కులాలు మిగితా 2వ పేజీలో

# ఎఫ్‌సీఐ లేఔట్‌ను పునరుద్ధరించిన హైడ్రా

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ గచ్చిబౌలి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్నఫెర్టిలై జర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లే ఔట్‌ను హైడ్రా మంగళవారం పునరుద్ధరించింది. ఈ లే ఔట్ హద్దులను చెరిపేస్తూ సంధ్యా కన్వెన్షన్ ప్రతినిధులు పలు నిర్మాణాలు చేయగా.. వాటిని గత నెల 6న హైడ్రా తొలగించిన విషయం తెలిసిందే. 20 ఎకరాలకు పైగా ఉన్న లే ఔట్‌లో 170 వరకూ ప్లాట్ యజమానులున్నారు. 1980వ దశకంలో వేసిన లే ఔట్ నామ రూపాలు లేకుండా కబ్జాలకు గురైందని హైడ్రా ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. రహదారులు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల హద్దులు లేకుండా పోయిన ఈ లే ఔట్‌ను హైడ్రా పునరుద్ధరించింది. జీహెచ్ ఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కలిసి.. హైడ్రా అధికారులు ఈ లేఔట్‌కు మళ్లీ జీవం పోశారు. గతంలో ఉన్న లే ఔట్ ప్రకారం రహదారులకు హద్దులు నిర్ధారించి.. వెనువెంటనే వాటి నిర్మాణానికి చర్యలు తీసుకుంది. లే ఔట్ ప్రకారం ప్రధాన రహదారులతో పాటు.. ఇంటర్నల్ రహదారులను పునరుద్ధరించింది. రహదారులతో పాటు.. పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల హద్దులను నిర్ధారించడంతో అక్కడి ప్లాట్ యజమానులు హర్షం వ్యక్తం చేశారు. లే ఔట్ ప్రకారం ఎవరి ప్లాట్‌ను వారు గుర్తించి హద్దులు నిర్ధారించుకున్నారు. మ్యాంగో, యునెక్స్ ఫుడ్ కోర్టులతో పాటు స్పైసీ బార్ ఇలా 7 వరకూ ఉన్న దుకాణ సముదాయాలు కూడా రోడ్డుపై నిర్మించినట్టు అధికారులు గుర్తించారు. వాటిని తొలగించాలని నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. ఒకటి రెండు రోజుల్లో వాటిని కూడా తొలగించి రోడ్డు నిర్మాణం చేపడతామని హైడ్రా ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు.

లే అవుట్‌లో ప్లాట్ ఓనర్ల సమక్షంలో హైడ్రా సంస్థ రోడ్లను మార్కింగ్ చేస్తుండగా ఈ ప్రక్రియను వీడియో తీస్తున్న ప్లాట్ యజమానులపై సంధ్య కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సినీనటి రమ్యశ్రీ, ఆమె సోదరుడు ప్రశాంత్‌పై కత్తులు, క్రికెట్ బ్యాట్లతో దాడి చేసినట్టు తెలిసింది. ఈ దాడిలో గాయాలపాలైన వారు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రమ్యశ్రీ మాట్లాడుతూ తమపై హత్యాయత్నం జరిగిందని, సంధ్య కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## కేటీఆర్ సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అప్పగించాలి

- ఏసీబీ ఆదేశాలు..
- అది ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే : కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఫార్ములా ఈ- కార్ రేసు కేసులో ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. బుధవారంలోగా సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అప్పగించాలని కేటీఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు. కేటీఆర్ వాడిన సెల్ ఫోన్, మ్యాక్ బుక్, ట్యాబ్ లో కీలక సమాచారం ఉందని ఏసీబీ భావిస్తుంది. ఈ ఎలక్ట్రానిక్ పరికరాల నుంచే కేటీఆర్ అధికారులకు ఆదేశాలు జారీ చేసి ఉంటారని ఏసీబీ యోచిస్తుంది. అయితే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్టేట్ మెంట్ ఆధారంగా డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు రెడీ చేస్తున్నారు.

ఫార్ములా ఈ కారు రేసు కేసులో సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ అప్పగించాలని ఎసిబి ఇచ్చిన ఆర్డర్స్ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. ఎసిబి ఆదేశాలపై తన న్యాయవాదుల బృందంతో చెర్చిన కేటీఆర్.. బలవంతంగా వ్యక్తిగత సెల్‌ఫోన్లు తీసుకోకూడదని సుప్రీం ఆదేశాలు ఉన్నాయన్నారు. సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఇవ్వాల్సిన అవసరం లేదని కెటిఆర్ లాయర్ల బృందం తెలిపారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. "ఫోన్లు, వ్యక్తిగత పరికరాలు చూపించమని పోలీసులు బలవంతం చేయకూడదు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు యాక్సెస్ చేయొద్దని ఈడీ కేసులో తీర్పు ఉంది. ఆర్టికల్ 20/3 ప్రకారం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుంది. వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కు, గోప్యత ఇందులో భాగమే" అని కెటిఆర్ పేర్కొన్నారు.

# ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లను సకాలంలో పూర్తి చేయాలి

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల,**



వస్త్ర పరిశ్రమ సోసైటీలకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని, చీరల ఉత్పత్తి ఆర్డర్ సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో చేనేత జౌళి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా లతో కలిసి మ్యాక్స్ సంఘాల సభ్యులు, ఆసాములతో చీరలు ఉత్పత్తి పురోగతి పై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి, కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వ కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,నిర్దేశిత గడువు లోగా చీరల ఉత్పత్తి ఆర్డర్ పూర్తి చేయాలని అన్నారు. ఇందిరా మహిళా శక్తి ఆర్డర్ ద్వారా వస్త్ర పరిశ్రమ కార్మికులకు 8 నెలల పాటు ఉపాధి లభిస్తుందని, మిగిలిన 4 నెలలు కూడా ఉపాధి లభించే విధంగా ప్రభుత్వం తరపున ఇతర శాఖల నుంచి కూడా పెద్ద ఎత్తున ఆర్డర్లు నేత కార్మికులకు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లను సకాలంలో పూర్తి చేసి ప్రభుత్వం పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు.

చేనేత జౌళి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళా సంఘాల సభ్యులకు 2 చీరలు పంపిణీ చేసేందుకు నిర్ణయించిందని అన్నారు .మొదటి చీర పంపిణీ చేసేందుకు సిరిసిల్లలోని 131 మ్యాక్స్ సొసైటీ పరిధిలోని 16 వేల 424 పవర్ లూమ్స్ కు 4 కోట్ల 30 లక్షల మీటర్ల చీరల ఉత్పత్తి ఆర్డర్ జనవరి , మార్చి నెలలో 2 దశలలో అందించిందని అన్నారు.

మొదటి దశ 2 కోట్ల 12 లక్షల మీటర్ల చీరలు ఉత్పత్తి ఆర్డర్ కు ఇప్పటి వరకు సిరిసిల్ల చేనేత సొసైటీ నుంచి 50 లక్షల 55 వేల మీటర్ల ఉత్పత్తి పూర్తి చేశామని,ఆగస్టు 15 నుంచి చీరల పంపిణీ చేయాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. చీరల ఉత్పత్తి ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సంబంధిత మ్యాక్స్ సంఘాల సభ్యులకు సూచించారు. 45 రోజుల గడువు లో 3.5 కోట్ల మీటర్ల చీర ఉత్పత్తి చేయాలని, ప్రతి సోసైటీ పరిధిలో ఉన్న పవర్ రూమ్స్ పూర్తి స్థాయిలో చీరల ఉత్పత్తి చేయాలని, రోజూ ఉదయం, రాత్రి షిఫ్టుల్లో పని చేయాలని అన్నారు.పవర్ లూమ్స్ లలో కార్మికుల సంఖ్య పెంచాలని అన్నారు.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. పాత బకాయిలను దాదాపు పూర్తి స్థాయిలో చెల్లింపులు చేశామని, ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని శాఖల నుంచి బట్ట ఉత్పత్తి ఆర్డర్లు చేనేత సోసైటీలకు వస్తుందని, స్కూల్ , అంగన్ వాడి ఏక రూప దుస్తులు ఆర్డర్ అందించామని, రాబోయే రోజుల్లో దేవాదాయ శాఖ నుంచి కూడా మరో ఆర్డర్ వస్తుందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి క్రింద ప్రభుత్వం అందించే ఆర్డర్ చాలా పెద్దదని, దాదాపు సంవత్సరానికి 9 కోట్ల మీటర్ల బట్ట ఉత్పత్తి చేయాల్సి ఉంటుందని అన్నారు. సోసైటీలు చీర ఉత్పత్తి ప్రక్రియ వేగవంతం చేసి సకాలంలో ఆర్డర్ పూర్తి చేయాలని అన్నారు.ప్రతి సోసైటి కు కేటాయించిన లక్ష్యంలో కనీసం 50 శాతం జూన్ నెలాఖరు వరకు పూర్తి చేయాలని, లేని పక్షంలో సంబంధిత సోసైటీ ఆర్డర్ రద్దు చేసి 50 శాతం పూర్తి చేసిన సోసైటీలకు ఆర్డర్ అందిస్తామని అన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కు అవసరమైన ఆర్డర్ లన్ని రాష్ట్ర ప్రభుత్వం తరపున అందిస్తున్నామని తెలిపారు. కార్మికులకు ప్రతి వారం 4 వేల నుంచి 5 వేల రూపాయల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇందిరా మహిళల శక్తి చీరల ఆర్డర్ పొందిన వారు మొదటి చీర ఉత్పత్తిని త్వరగా పూర్తి చేసి అందజేయాలని సూచించారు. రెండో చీర ఆర్డర్ కు సిద్ధం కావాలని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.అనంతరం సొసైటీల వారీగా చీరల ఉత్పత్తి పురోగతిని సమీక్షించి పలు సూచనలు చేసి వారి నుండి ఖచ్చితమైన ఆర్డర్ వివరాలను నమోదు చేశారు.

**టెక్స్టైల్స్ పార్క్ యజమానులతో సమావేశం**

సిరిసిల్ల సమీపంలోని టెక్స్టైల్స్ పార్క్ యజమానులతో చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం మినీ సమావేశ మందిరంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా టెక్స్టైల్స్ పార్క్ యజమానులు తమకు ప్రభుత్వం నుంచి మరిన్ని వస్త్రం ఉత్పత్తి ఆర్డర్లు ముందస్తుగా ఇవ్వాలని, తమ సమస్యలు పరిష్కరించాలని చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ ను కోరారు. వివిధ శాఖలకు అవసరమైన ఆర్డర్స్ అందజేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం నాణ్యతతో వస్త్రాలు ఉత్పత్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, చేనేత జౌళి శాఖ జేడీ ఎన్ వెంకటేశ్వర్ రావు,

ఏడీ రాఘవరావు, వివిధ మ్యాక్స్ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు యజమానులు ఆసాములు, టెక్స్టైల్స్ పార్క్ యజమానుల సంఘం అధ్యక్షుడు అన్నల్ దాస్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# 26న గోల్కొండ కోట నుంచి తొలి బోనం

**(మొదటి పేజీ తరువాయి)**

పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోడ్లు, విద్యుత్, నీటి సదుపాయాల విషయంలో సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ ఏడాది తొలి బోనం గోల్కొండ కోట నుంచే జూన్ 26న ప్రారంభం కానుందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ. 20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రధాన దేవాలయాల్లో ప్రభుత్వ ప్రతినిధులు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని వెల్లడించారు. కోట కింద భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని దృష్టిలో పెట్టుకొని బారికేడ్లు ఏర్పాటు చేయాలని, శానిటేషన్, తాగునీటి సదుపాయాలు కల్పించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాల్సిందిగా, అవసరమైన చోట జనరేటర్లు సిద్ధంగా ఉంచాలన్నారు. ఆరోగ్య శాఖ హెల్త్ క్యాంపులు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఫైర్ విభాగం అప్రమత్తంగా ఉండి అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచాలన్నారు.

బోనాల సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల నుంచి గోల్కొండకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, శాసనసభ్యులు కౌసర్ మొహియుద్దీన్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్ రెడ్డి, కలెక్టర్ హరి చందన దాసరి, అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, డీసీపీ చంద్రశేఖర్, దేవాలయాల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లకు రైల్‌రోకో

**(మొదటి పేజీ తరువాయి)**

ఉన్నాయి. రాజకీయ అవకాశాల్లో బీసీ మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మహిళా రిజర్వేషన్లలో బీసీలకు ఉప కోటా ఉండాలి. ఇది రాజకీయ వేదిక కాదు%ౌ% ఇది మానవ హక్కులు, సామాజిక హక్కులు వేదిక. సమాజంలో 56 శాతం జనాభాకు సంబంధించి హక్కులు కోరుతుంటే అవి మానవ హక్కులు కావా..? ఇప్పుడు మాట్లాడాల్సిన సందర్భం వచ్చింది.. కాబట్టి అందరూ కలిసికట్టుగా హక్కల కోసం పోరాటం చేయాలి. సరైన సమయంలో జాగృతి మాట్లాడింది కాబట్టి అసెంబ్లీలో మూడు బిల్లులు వచ్చాయి. అదే స్ఫూర్తితో బీసీ బిల్లులను కేంద్రం ఆమోదించేలా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు.

ఢిల్లీకి బిల్లు పంపించి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుంది. మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు బీసీ బిల్లు గురించి ఒక్క రోజు కూడా మాట్లాడలేదు. రఘునందన్ రావు బీసీల కోసం ఎందుకు మాట్లాడడం లేదు..? కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లును ఎందుకు ఆమోదించడం లేదని ప్రతీ ఒక్కరు రఘునందన్ రావును ప్రశ్నించాలి. కులగణన వివరాలను కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల వారీగా ప్రకటించాలి. రౌండ్ టేబుల్ సమావేశానికి రానివ్వకుండా బీసీ నాయకులను మెదక్‌లో కొంత మంది బెదిరించే ప్రయత్నం చేశారు. దీన్ని బట్టే వాళ్ల భయపడుతున్నారని అర్థమవుతోంది అని ఎమ్మెల్సీ కవిత అన్నారు.

## మహారాష్ట్రలో ఫార్మా యూనిట్ పేలుడు..

**ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు**

**బలగం టీవీ, నాగ్‌పూర్**

మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. భిల్గావ్‌లోని అంకిత్ పల్ప్ అండ్ బోర్డ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్లాంట్‌లోని గ్లాస్ లైన్ రియాక్టర్ లోపల పేలుడు సంభవించిందని పోలీసు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా, ఆరుగురు గాయపడ్డారు. రెస్క్యూ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని.. గాయపడిన వారిని వైద్య చికిత్స కోసం కాంప్టీ పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## హైదరాబాద్ నుంచి ఆఫ్రికాకు నేరుగా విమాన సేవలు

**బలగం టీవి, హైదరాబాద్**

దేశీయ అంతర్జాతీయ విమాన సేవల విస్తరణలో భాగంగా హైదరాబాద్ జీఎంఆర్ విమానాశ్రయంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమయింది. జీఎంఆర్ హైదరాబాద్ విమానాశ్రయం నుంచి ఆఫ్రికాకు నేరుగా విమాన సేవలు మంగళవారం ప్రారంభించారు.- ఇథియోపియా రాజధాని అడ్డిస్ అబాబాలోని బోల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు మంగళవారం నేరుగా ఈ సర్వీసు ప్రారంభమయింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జీహెచ్ఐఏఎల్ సీనియర్ అధికారులతో పాటు, ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీహెచ్ఐఏఎల్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ ప్రదీప్ పనిక్కర్ మాట్లాడుతూ ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ హైదరాబాద్ నుంచి అడ్డిస్ అబాబాకు నాన్-స్టాప్ సేవలు ప్రారంభించడంతో గ్లోబల్ కనెక్టివిటీ మరింత బలపడిందన్నారు. జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ లిమిటెడ్ ( జీహెచ్ఐఏఎల్) హైదరాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుంచి ఆఫ్రికా ఖండానికి నేరుగా విమాన సేవలు ప్రారంభించడంతో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రో విమానాశ్రయాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలుస్తుందన్నారు. ఈ సేవలను ఆఫ్రికాలో అతిపెద్ద, అత్యంత విశ్వసనీయమైన విమానయాన సంస్థ అయిన ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. ఇది హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ వాణిజ్యం, పర్యాటకం, ప్రజల మధ్య సంబంధాల కేంద్రంగా మారుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. దక్షిణ భారతదేశం, ఆఫ్రికా ఖండం మధ్య కీలకమైన ఆకాశ మార్గంగా ఈ నూతన రూట్ వ్యవహరిస్తోందని ఆయన వెల్లడించారు.- ఇథియోపియా రాజధాని అడ్డిస్ అబాబా ఆఫ్రికాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపార, సాంస్కృతిక, చరిత్రపరమైన కేంద్రంగా గుర్తింపు పొందుతోందని,

ఇటి682 నెంబరు విమానం అడ్డిస్ అబాబా నుంచి హైదరాబాద్‌కు 16.30 గంటలకు(స్థానిక కాలమానం ప్రకారం) బయలు దేరి తరువాత రోజు 01.00 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) హైదరాబాద్‌కు చేరుకుంటుంది. సోమ, బుధ, శుక్రవారాల్లో ఈ సర్వీస్ ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ఇటి683 విమాన ప్రతి మంగళ, గురు, శని వారాల్లో హైదరాబాద్‌లో 02.00 గంటలకు బయలు దేరి అడ్డిస్ అబాబాకు తరువాత రోజు 05.00 గంటలకు చేరుకుంటుంది. వారంలో మూడు సార్లు ఈ విమాన సర్వీసు సుమారు ప్రయాణికులకు అందుబాటులో ఉందనుందని విమానశ్రయ అధికారులు పేర్కొన్నారు.


## టీపీసీసీ చీఫ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు

**(మొదటి పేజీ తరువాయి)**

లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ అబద్ధాలు చెప్పడంలో పోటీపడుతున్నట్టు కనిపిస్తోందని, రాష్ట్రాన్ని నడిపించే సత్తా, సామర్థ్యం లేకపోవడంతోనే ఇలాంటి అటెన్షన్ డైవర్షన్ కుట్రలతో కాలం వెల్లదీసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేవలం రాజకీయంగా పబ్బం కడుక్కునేందుకు చేసే ఇలాంటి దుర్మార్గపూరిత వ్యాఖ్యల పైన మహేష్ కుమార్ గౌడ్ లాంటి నాయకులను కోర్టులకు ఈడుస్తామని కేటీఆర్ హెచ్చరించారు. ఇప్పటికైనా పరిపాలన పైన దృష్టి పెట్టి, అటెన్షన్ డ్రైవరేషన్ డ్రామాలను పక్కన ప్రతిపక్ష నాయకుల పైన ప్రాపగాండా చేయడం మానాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజలకు మంచి చేసే అంశాల పైన దృష్టి సారించాలని హితవు పలికారు.

## కెనడాలో ప్రధాని మోడీ

**బలగం టీవి, హైదరాబాద్**



ప్రధాని నరేంద్ర మోడీ నాలుగు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా... మంగళ వారం కెనడాలోని కాల్గరీ నగరానికి చేరుకున్నారు. కననాస్కిస్ వేదికగా నేడు జరగనున్న 51వ జీ 7 శిఖరాగ్ర సదస్సులో ప్రధానమంత్రి మోడీ పాల్గొననున్నారు. ఈ సదస్సు కు ఉక్రెయిన్ దేశాధ్యక్షుడు జెలనెస్కీతోపాటు వివిధ దేశాల నేతలు పాల్గొననున్నారు. ఈ సదస్సులో భాగంగా కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీతోపాటు వివిధ దేశాల నేతలతో ప్రధాని మోడి ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఈ రోజు మధ్యాహ్నం జరిగే సదస్సులో ప్రధాని మోడీ, జెలెన్ స్కీతోపాటు ఆస్ట్రేలియా, బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా తదితర దేశాలకు చెందిన నేతలు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రపంచంలో జీ -7 దేశాల ప్రజల రక్షణ, ఇంధన భద్రతను పెంచడం, డిజిటల్ రంగాన్ని వేగవంతం చేయడం, భవిష్యత్తు భాగస్వామ్యాలు సురక్షితం చేయడం వంటి తదితర అంశాలను ఈ సదస్సులో ప్రధానంగా నేతలు చర్చించనున్నారు. ప్రధాని మోడీ ఇప్పటికే సైప్రస్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ దేశ అత్యున్నత పురస్కారాన్ని ప్రధాని మోడీకి సైప్రస్ ప్రభుత్వం బహుకరించిన సంగతి విదితమే. అలాగే సైప్రస్ ఇచ్చిన అతిథ్యంపై ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. ఇక ఈ రోజు సాయంత్రం ప్రధాని మోడీ కెనడా నుంచి క్రొయేషియాకు బయలుదేరి వెళ్లనున్నారు. ఆ పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగి రానున్నారు.

# ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు..



## -ఎల్లారెడ్డిపేట ప్రారంభం

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎంపీ నిధులతో ఎల్లారెడ్డిపేట మండలంలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. బీజేపీ ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు రేపాక రామచంద్రం ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ టెంపుల్ వద్ద మరియు అంబేద్కర్ ఎస్సీ కాలనీలోని స్మశాన వాటికలో నూతన బోరువెల్కు భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజకీయం అనేది ఎన్నికల వరకు మాత్రమేనని, ఎన్నికల తర్వాత అభివృద్ధి పనులలో అన్ని పార్టీల వారితో కలిసి పనిచేస్తామని స్పష్టం చేశారు. ఎల్లారెడ్డిపేట మండలానికి మరిన్ని నిధులు వచ్చేలా కృషి చేస్తానని కూడా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పొన్నాల తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, బుగ్గారెడ్డి, నంది నరేష్, రాజిరెడ్డి, సంజీవరెడ్డి, బాలా సాయికుమార్, బాలకృష్ణ గౌడ్, దయాకర్, రామ్ రెడ్డి, దేవదాస్, కిరణ్ నాయక్, సాయి చరణ్, శ్రీకాంత్, నవీన్ తో పాటు బీజేపీ కార్యకర్తలు, గౌడ కులస్తులు, దళిత కుల పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వస్త్ర పరిశ్రమ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

**-ఇందిరా మహిళా శక్తి చీరలతో చేతినిండా ఉపాధి**

**-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ, సిరిసిల్ల**

గతంలో కార్మికులు ఉపాధి లేక ఇబ్బంది పడేవారు, ఇప్పుడు చేతినిండా పని ఉంటుందని, వస్త్ర పరిశ్రమ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని,రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆర్డర్లను ఆసాములు, కార్మికులు సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్అన్నారు. సిరిసిల్లలోని గణేష్ నగర్ లో ఉన్న మామిడాల నారాయణ, కొండ సుభాష్ కు మరమగ్గాల యూనిట్లను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత జౌళి, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులతో కలిసి మంగళవారం చీరల ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి, కార్మికులను ఆదుకునేందుకు చేతినిండా పని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, ఇందులో భాగంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇందిరా మహిళ శక్తి కింద చీరల ఉత్పత్తి ఆర్డర్లు అందించామని అన్నారు.

ఇందిరా మహిళా శక్తి చీరలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికులు, ఆసాములకు దాదాపు 8 నెలల పాటు ఉపాధి లభిస్తుందని,గతంలోని బతుకమ్మ చీరల బకాయిలు దాదాపు 280 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందని అన్నారు.సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా దశాబ్దాల కల నెరవేరుస్తూ వేములవాడలో రూపాయలు 50 కోట్లతో యార్న్ బ్యాంకు ఏర్పాటు చేశామని,సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు అవసరమైన యార్న్ అంతా అక్కడ అందుబాటులో పెడుతున్నామని అన్నారు.. సెస్ పరిధిలోని బ్యాక్ బిల్లింగ్ సమస్య కోర్టు పరిధిలో ఉందని దానిపై త్వరలో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇతర మంత్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా చేనేత జౌళి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కు అవసరమైన ఆర్డర్లన్నీ రాష్ట్ర ప్రభుత్వం తరపున అందజేస్తున్నామనిఅన్నారు. కార్మికులకు ప్రతివారం రూపాయలు 4000 నుంచి 5000 వరకు ఆదాయం వస్తుందని,రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇందిరా మహిళల శక్తి చీరల ఆర్డర్ పొందిన వారు మొదటి చీర ఉత్పత్తిని త్వరగా పూర్తి చేసి అందజేయాలనిఅన్నారు. రెండో చీర ఆర్డర్ కు సిద్ధం కావాలని,రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధిలోకి రావాలనిఅన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.




# నాన్నను సన్మానించిన కొడుకు

**బలగం టీవీ, కరీంనగర్**

పితృదినోత్సవ సందర్భంగా భవానీ సాహితీ వేదిక కరీంనగర్ డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన నాన్నకు ప్రేమతో కవితాసంపుటి పుస్తకపరిచయ సభ కరీంనగర్ లో వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా తెలుగు కవి, సాహితీ విమర్శకుడు డాక్టర్ మోత్కుల నారాయణ గౌడ్ నాన్నపై కవితను చదివి సభికులను ఆహ్లాదపరిచారు. ఈ సందర్భంగా వారి నాన్నకు మోతుకుల పోచయ్య గౌడ్ ని సాహితీ వేదిక నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఇది పితృ దినోత్సవం సందర్భంగా కొడుకు తండ్రికి చేసిన సన్మానంగా ఆ సభలో ఉన్న తెలుగు సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్, దాస్యం సేనానధిపతి, ముఖ్య అతిథిఎన్. వి రఘువీర్ ప్రతాప్, విశిష్ట అతిథి బుస్స శ్రీనివాస్, సమీక్షకులు కథకులు కూర చిదంబరం, విశ్రాంత ఉపాధ్యాయసంఘ నాయకులు నరహరి లక్ష్మారెడ్డి, టి. కిషన్ తదితర సాహితీవేత్తలు పాల్గొని సభను విజయవంతం చేశారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

**-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 23 ఫిర్యాదులు స్వీకరణ**

**- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 23 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



## కూల్చివేతలను పరిశీలించిన కలెక్టర్

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడలోని తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం దాకా చేపడుతున్న కూల్చివేత పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారి రాధా బాయి, మున్సిపల్, ఆర్ అండ్ బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**నిర్వాసితులకు చెక్కుల పంపిణీ**

వేములవాడ పట్టణంలో రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. వేములవాడ తిప్పాపూర్ బ్రిడ్జి నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్న సందర్భంగా భూములు కోల్పోతున్న నిర్వాసితులకు జిల్లా సమీకృత కార్యాలయల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వేములవాడ ఆర్డీవో రాధాబాయి చెక్కులు పంపిణీ చేశారు. ఇప్పటిదాకా వేములవాడలోని 100కి పైగా మందికి చెక్కులు అందజేసినట్లు ఆర్డీవో తెలిపారు. వేములవాడలోని ఇంకా చాలా మంది నష్టపరిహారం చెక్కులు తీసుకునేందుకు సుముఖంగా ఉన్నట్లు ఆర్డీవో చెప్పారు.



# ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి..

**- ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత**



**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం నీలోజిపల్లి, కొదురుపాక, వరదవెల్లి గ్రామాలకు చెందిన శ్రీ రాజరాజేశ్వర జలాశయం నిర్వాసితులు కాంగ్రెస్ పార్టీ జిల్లా బీ.సీ. సెల్ అధ్యక్షులు కూస రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా పెండింగ్ సమస్యలు ప్రతి ఒక్క నిర్వాసితునికి ఆనాడు మనం ఎలక్షన్లో మాట ఇచ్చాం. శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేరు) ఉద్యమంలో ఆమరణ నిరాహార దీక్ష, వంటావార్పు, నంది కమాన్ ముట్టడి నీలోజిపల్లి నుండి సిరిసిల్ల వరకు పదివేల మందితో పాదయాత్ర, కొదురుపాకలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినాము. అప్పుడు ఇప్పటి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ప్రస్తుతం వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా ఉద్యమంలో పాల్గొని మాకు సంఘీభావం తెలుపడం జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయలు ఇస్తామని మాట ఇవ్వడం జరిగింది. అర్హులైన నిర్వాసితులకు పట్టా, ప్యాకేజీ ఇవ్వాలని, 18 సంవత్సరాలు నిండిన అమ్మాయిలకు, అబ్బాయిలకు రెండు లక్షలు ఇవ్వాలని, అలాగే ఇంటి అడుగు జాగాకు డబ్బులు ఇవ్వాలని, పెండింగ్ సమస్యలన్నీ పూర్తి చేయాలని ఎమ్మెల్యేని కోరడం జరిగిందని బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్ అన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వెంటనే స్పందించి కలెక్టర్ తో మాట్లాడి ఈనెల 20 లేదా 21 తేదీన ముంపు నిర్వాసితులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

# ఇక నాలుగు రోజుల టెస్టులు...!

- కొన్ని జట్లకే పరిమితం!

బలగం టీవీ, హైదరాబాద్

ఐసీసీ టెస్ట్ క్రికెట్‌లో కీలక మార్పులకు శ్రీకారం చుడుతోందని తెలుస్తోంది. సుదీర్ఘ టెస్ట్ ఫార్మాట్‌కు మరింత ఆదరణ పెంచే ఉద్దేశంతో, ముఖ్యంగా చిన్న దేశాలకు భారం తగ్గించేందుకు నాలుగు రోజుల టెస్టులను ప్రవేశపెట్టేందుకు ప్లాన్ చేస్తోందని సమాచారం. 2027-29 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్ నుంచి కొన్ని చిన్న దేశాల మధ్య జరగబోయే టెస్టులను నాలుగు రోజులకు పరిమితం చేయాలని ఐసీసీ భావిస్తోందని తెలిసింది. అయితే భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ లాంటి క్రికెట్ శక్తిమంత దేశాలకు మాత్రం ఐదు రోజుల సంప్రదాయ టెస్టులే కొనసాగించనున్నట్లు సమాచారం.



చిన్న దేశాల బడ్జెట్ పరిమితులు, మ్యాచ్ నిర్వహణలో గడిచే సమయం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. నాలుగు రోజుల టెస్టులతో నిర్వహణ వ్యయం తగ్గడమే కాక, టూర్‌లను తక్కువ వ్యవధిలో పూర్తిచేసే అవకాశముంటుంది. ఇటీవలి లార్డ్స్‌లో జరిగిన డబ్ల్యూటీసీ ఫైనల్ సందర్భంగా, సభ్యదేశాల మధ్య జరిగిన సమావేశంలో ఐసీసీ చైర్మన్ జై షా ఈ ప్రతిపాదనకు మద్దతు తెలిపినట్టు సమాచారం.

ఇప్పటికే 2017లోనే ఐసీసీ, ద్వైపాక్షిక ఒప్పందాలతో నాలుగు రోజుల టెస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇంగ్లండ్, ఐర్లాండ్ (2019, 2023), జింబాబ్వే (2017) మధ్య ఇలాంటి టెస్టులు జరగడం తెలిసిందే. ఈ నాలుగు రోజుల మ్యాచ్‌ల్లో రోజుకు 90 ఓవర్ల బదులు 98 ఓవర్లను వేయించే అవకాశముంది. అయితే, ప్రస్తుతం కొనసాగుతున్న 2025-27 డబ్ల్యూటీసీ సైకిల్ మాత్రం ఐదు రోజుల ఫార్మాట్‌లోనే సాగుతుందని ఐసీసీ స్పష్టం చేసింది.

2027-29 సిరీస్ కోసం ఐసీసీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చిన్న దేశాలకు టెస్టు మ్యాచ్‌లను నాలుగు రోజులే నిర్వహించాలన్న నిర్ణయాన్ని ఐసీసీ తీసుకున్నట్లు ఓ నివేదిక ద్వారా తెలుస్తోంది. సంప్రదాయకరమైన 5 రోజుల టెస్టును నిర్వహించేందుకు చాలా దేశాలు నిర్లిప్తంగా ఉన్నాయని, అయితే 4 రోజుల టెస్టులను నిర్వహించడం వల్ల.. మూడు టెస్టుల సిరీస్‌ను కేవలం మూడు వారాల్లోనే పూర్తి చేయవచ్చు అని రిపోర్టులో వెల్లడించినట్లు తెలుస్తోంది. 4 రోజుల మ్యాచ్‌ల్లో ఓవర్లను 98కి పెంచాలని భావిస్తున్నారు.



# నెంబర్ 1 స్మృతి మంధాన

బలగం టీవీ, హైదరాబాద్

ఐసీసీ మహిళల వన్డే ర్యాంకింగ్స్ లో టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అగ్రస్థానానికి దూసుకెళ్లింది. మంగళవారం ఐసీసీ ప్రకటించిన ర్యాంకింగ్స్ లో 727 రేటింగ్ పాయింట్లతో టాప్ కు చేరుకుంది. సౌతాఫ్రికా మహిళా క్రికెటర్ లారా వోల్వార్ట్‌ను వెనక్కి నెట్టిన మంధాన ఆరేళ్ళ తర్వాత తిరిగి వన్డేల్లో నెంబర్ వన్ స్థానానికి చేరుకోవడం విశేషం. చివరిసారిగా స్మృతి 2019లో నెంబర్ ర్యాంక్ లో నిలిచింది. సౌతాఫ్రికా కెప్టెన్ వోల్వార్ట్ 19 రేటింగ్ పాయింట్లు కోల్పోవడంతో స్మృతి టాప్ ర్యాంక్ కు చేరుకుంది. 2019 తర్వాత భారత వైస్ కెప్టెన్ మంధాన మళ్లీ ర్యాంకుల్లో ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది.

లారా వోల్వార్ట్ (719), ఇంగ్లాండ్ కెప్టెన్ నటాలీ స్కైవర్-బ్రంట్ (719) సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. అయితే కౌంట్‌బ్యాక్‌లో వోల్వార్ట్ మూడో స్థానానికి పడిపోయింది. ఇంగ్లాండ్ వికెట్ కీపర్ అమీ జోన్స్, ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ అమీ జోన్స్ వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. టాప్ 10 లో నాలుగు ఆస్ట్రేలియా క్రికెటర్లు ఉండడం విశేషం. ఇతర భారత బ్యాటర్లలో జెమిమా రోడ్రిగ్స్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వరుసగా 14 మరియు 15వ స్థానాల్లో ఉన్నారు. బౌలర్ల విభాగంలో ఇంగ్లాండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్ 747 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. భారత బౌలర్లలో దీప్తి శర్మ నాలుగో స్థానానికి చేరుకుంది.


## కర్ణాటకలో థగ్ లైఫ్ విడుదల చేయండి

### సుప్రీంకోర్టు

బలగం టీవీ, హైదరాబాద్

కమల్ హాసన్ నటించిన 'థగ్ లైఫ్' సినిమా కర్ణాటకలో విడుదలకు లైన్ క్లియర్ అయింది. సినిమాకు సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ ఉన్నందున, వివాదాలతో సంబంధం లేకుండా కర్ణాటకలో విడుదల చేయాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో కర్ణాటక ప్రభుత్వ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అత్యున్నత న్యాయస్థానం, 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కమల్ హాసన్ గతంలో కన్నడ భాషపై చేసిన కొన్ని వ్యాఖ్యలు ("కన్నడ తమిళం నుండే పుట్టింది") వివాదాస్పదం కావడంతో, 'థగ్ లైఫ్' సినిమాను కర్ణాటకలో విడుదల చేయనీయకుండా కన్నడ సంఘాలు అడ్డుకున్నాయి. కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా సినిమాను నిషేధించాలని హెచ్చరించింది. జూన్ 5న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా ఇప్పటివరకు కర్ణాటకలో ప్రదర్శనకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో, సినిమా విడుదలకు భద్రత కల్పించడంలో విఫలమైనందుకు కర్ణాటక ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. "సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అనుమతి పొందిన సినిమాను విడుదల చేయాల్సిందే. చట్టబద్ధమైన పాలన ఇదే చెబుతోంది," అని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. కమల్ హాసన్ క్షమాపణ చెప్పాలని కర్ణాటక హైకోర్టు సూచించడాన్ని కూడా సుప్రీంకోర్టు తప్పుపట్టింది. "జూన్ 3న హైకోర్టు కమల్ హాసన్‌ను క్షమాపణ చెప్పమని కోరడం సరికాదు," అని పేర్కొంది.తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, కన్నడ భాష పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని కమల్ హాసన్ చెబుతున్నప్పటికీ, క్షమాపణ చెప్పేందుకు నిరాకరించారు. ఈ కేసును కర్ణాటక హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు తనకు బదిలీ చేసుకుంది. "రాష్ట్రాన్ని అల్లరి మూకలు, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారి నియంత్రణలోకి వెళ్లనివ్వలేం" అని జస్టిస్ ఉజ్జల్ భూయాన్ గత విచారణలో వ్యాఖ్యానించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసింది.

## రవితేజ కొత్త సినిమా షురూ...




బలగం టీవీ, హైదరాబాద్

మాస్ హీరో రవితేజ తన 76వ చిత్రాన్ని కిషోర్ తిరుమల దర్శకత్వంలో చేస్తున్నాడు. ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో వేసిన ప్రత్యేక సెట్‌లో ఈ సినిమా షూటింగ్ మంగళవారం మొదలైంది. రవితేజతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా పూర్తిస్థాయి కుటుంబ వినోదాత్మక చిత్రంగా ఉంటుందని, రవితేజ తన మార్క్ కామెడీ టైమింగ్, మాస్ అప్పీల్‌తో ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ సినిమా కోసం రవితేజ సరికొత్త మేకోవర్‌తో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రఫీ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, ఏ. ఎస్. ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్ అందిస్తున్నారు. 2026 సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానుంది. ప్రస్తుతం రవితేజ "మాస్ జాతర" అనే మరో సినిమాలో కూడా నటిస్తున్నారు, ఇది ఆగస్టు 27న విడుదల కానుంది.

## 'తమ్ముడు' నుంచి తొలి పాట వచ్చేసింది




బలగం టీవీ, హైదరాబాద్

నటుడు నితిన్ డైరెక్టర్ శ్రీరామ్ వేణు కాంబినేషన్ లో వస్తున్న సినిమా 'తమ్ముడు'. ఇటీవల ఈ మూవీ ట్రైలర్ కూడా విడుదల చేశారు. ఆసక్తికరంగా రూపొందించిన ఈ ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. తాజాగా ఈ సినిమా నుంచి తొలి సాంగ్ ను మేకర్స్ విడుదల చేశారు. మంగళవారం హైదరాబాద్ లో ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ ను నిర్వహించారు. 'భూ అంటే భూతం వస్తే..' అంటూ సాగే ఈ పాటను కొద్దిసేపటిక్రితమే రిలీజ్ చేశారు. ఈ పాటను అనురాగ్ కులకర్ణి, అక్షిత పోల అలపించారు. అజనీష్ లోక్ నాథ్ సంగీతం అందించారు. దిల్ రాజు, శిరీష్ నిర్మించిన ఈ సినిమాలో సీనియర్ హీరోయిన్ లయ, వర్ష బొల్లమ్మ తదితరులు కీలక పాత్రలో నటిస్తున్నారు. కాగా, జూలై 4న 'తమ్ముడు' మూవీ గ్రాండ్ గా థియేటర్లలో విడుదల కానుంది.

## పటౌడీ మెడల్'.. ఈసీబీ కీలక నిర్ణయం

బలగం టీవీ, హైదరాబాద్



భారత ఇంగ్లండ్ జట్ల మధ్య సిరీస్‌ను ఇరుదేశాల దిగ్గజాలు సచిన్ - అండర్సన్ పేర్లతో ట్రోఫీ నిర్వహిస్తామని ఇంగ్లండ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత లెజెండరీ ఆటగాళ్లు సునీల్ గవాస్కర్, బీసీసీఐ పెద్దలు పటౌడీ పేరు మార్చవద్దని ఈసీబీకి విన్నవించారు. సచిన్ టెండూల్కర్, ఐసీసీ ఛైర్మన్ జై షాలు సైతం ఆనవాయితీ ప్రకారం ఆయన పేరుతో ట్రోఫీ జరపాలని సూచించారు. ఈ ఇద్దరి విజ్ఞప్తితో దిగొచ్చిన ఇంగ్లండ్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. విన్నింగ్ కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్'ను కానుకగా ఇస్తామని ఈసీబీ.. తెలిపింది' అని మంగళవారం బీసీసీఐ ఓ ప్రకటనలో వెల్లడించింది.

'ఈ ఏడాది నుంచి భారత్, ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌ను పటౌడీ పేరుతో కాకుండా సచిన్ - అండర్సన్ ట్రోఫీగా నిర్వహించాలని ఈసీబీ నిర్ణయించింది. అయితే.. అలా చేయడం దిగ్గజ ఆటగాడైన పటౌడీని అగౌరపరచడమేనంటూ పలువురు భారత క్రికెటర్లు మండిపడ్డారు. తన పేరుతో ట్రోఫీ జరపాలనుకుంటున్న ఈసీబీకి టెండూల్కర్ కూడా ప్రత్యేక విన్నపం చేశాడు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇరుదేశాల సిరీస్‌లో పటౌడీ పేరు ఉండేలా చూడాలని కోరాడు. దాంతో, సానుకూలంగా స్పందించిన ఈసీబీ.. విన్నింగ్ కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్'ను కానుకగా ఇస్తామని తెలిపింది' అని మంగళవారం బీసీసీఐ ఓ ప్రకటనలో వెల్లడించింది.

జూన్ 20 నుంచి భారత్, ఇంగ్లండ్‌ల మధ్య తొలి టెస్టు జరుగనుంది. అంతకంటే ముందే సచిన్ అండర్సన్ ట్రోఫీని ఆవిష్కరించాలని ఈసీబీ భావించింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ సందర్భంగా లార్డ్స్ మైదానంలో ట్రోఫీ ఆవిష్కరణ వేడుక జరిపేందుకు ఏర్పాట్లు కూడా చేసింది. కానీ, జూన్ 12న అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం అనంతరం భారత క్రికెటర్లు విషాదంలో మునిగిపోయారు. దాంతో, ట్రోఫీ కార్యక్రమాన్ని వాయిదా వేసింది ఈసీబీ. ఇరుబోర్డులకు ఆమోదయోగ్యమైన రోజున అంటే జూన్ 19న ఆవిష్కరణకు సిద్ధమవుతోంది ఇంగ్లండ్ బోర్డు.

## పూరి - విజయ్ సేతుపతి సినిమాలో హీరోయిన్‌గా సంయుక్త

బలగం టీవీ, హైదరాబాద్



ప్రముఖ దర్శకుడు పూరీ జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కలయికలో రాబోతున్న ఓ భారీ చిత్రంలో సంయుక్త మీనన్ హీరోయిన్‌గా ఎంపికైంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ బృందం అధికారికంగా వెల్లడించింది. దర్శకుడు పూరీ జగన్నాథ్ స్వయంగా సంయుక్తకు స్వాగతం పలుకుతూ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ ఫొటోను పంచుకున్నారు. "ఆమె అడుగులో దయ, కళ్ళలో ఫైర్ ఉంది" అనే ఆసక్తికరమైన వ్యాఖ్యను ఆ పోస్ట్‌కు జోడించి, సినిమాపై అంచనాలను మరింత పెంచారు. ఈ చిత్రాన్ని పూరీ కనెక్ట్స్ పతాకంపై పూరీ జగన్నాథ్, ఒకప్పటి హీరోయిన్ చార్మీ కౌర్ కలిసి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో సీనియర్ నటి టబు, విలక్షణ నటి రాధికా ఆప్టే కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం.